క్లుప్తంగా

బసవేశ్వర స్వామికి విశేష పూజలు


బసవేశ్వర స్వామి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని బసవన్న కొండపై వెలసిన బసవేశ్వర స్వామికి విశేష పూజలు చేపట్టారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఉమేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువ జాము నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజలు గావించి మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు


బసలదొడ్డి హైరయ్యస్వామి

పెద్దకడబూరు : అమావాస్యను పురస్కరించుకొని వాయుపుత్ర హనుమాన్‌కు ఆదివారం ఆయా గ్రామాలలో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. మండల పరిధిలోని తారాపురం గ్రామంలో వెలసిన గిడ్డాంజనేయస్వామి, బసలదొడ్డి గ్రామంలో వెలసిన హైరయ్యస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బసలదొడ్డి గ్రామంలో ఆలయ అర్చకులు రామకృష్ణస్వామి స్వామివారికి పుష్పార్చన, పంచామృతాభిషేకం, నిర్మల్య అభిషేకం గావించి, వెండి కవచం, వస్త్రము, పుష్పాలతో అలంకరించారు. పల్లెపాడు గ్రామానికి చెందిన ఆకుల బజ్జయ్య కుమారుడు యల్లప్ప అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మాజీ సర్పంచ్ మృతి


లేపాక్షప్ప (ఫైల్)

పెద్దకడబూరు : మండల పరిధిలోని ముచ్చగిరి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ లేపాక్షప్ప(68) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి, జిల్లా అధికారప్రతినిధి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఫోన్ ద్వారా మృతుడి భార్య పుష్పావతి, కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ


ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఆదోని సెంట్రల్: కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి దారుణమని, ఈ సంఘటనను ముక్తకంఠంతో ఖండిస్తున్నామని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోవిందరాజు అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడికి నిరసగా ఆదివారం రాత్రి ఆదోని పట్టణంలో శాంతియుతంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఏబీవీపీ పట్టణ కార్యదర్శి ఉమామహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిడుగుపడి గడ్డివామి దగ్ధం


గడ్డివామికి నిప్పంటుకున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మల్కాపురం గ్రామంలో ఆదివారం సాయంత్రం పిగుడు పడి బోయ లక్ష్మన్న అనే వ్యక్తికి చెందిన గడ్డివామి దగ్ధమయ్యింది. గడ్డివామిపై పడుగు పడి పెద్ద ఎత్తున మంటలు చెలరేగటంతో గుర్తించిన గ్రామస్తులు ఆర్పేందుకు ప్రయత్నించారు. అయితే ఈదురు గాలులు ఎక్కువ ఉండటంతో మంటలు పెద్ద ఎత్తున చెలరేగి వామి పూర్తిగా కాలిబూడిదైంది. దీంతో రూ. 50 వేలు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు.

రైల్వే స్టేషన్‌లో వృద్ధుడి మృతి

ఆదోని సెంట్రల్: ఆదోని రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం నంబర్. 1లో ఖాసీం అనే వ్యక్తి ఆదివారం రాత్రి మృతి చెందాడని రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపారు. మృతుడు గుల్బర్గాకు వెళ్లడానికి స్టేషన్‌కు వచ్చాడు. అతడు అనారోగ్యంతో మృతిచెందాడని చెప్పారు. మృతుని వయస్సు 70 ఉంటుందన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని డిబ్బనకల్ గ్రామ శివారులోని బాట మారెమ్మవ్వ ఆలయం పక్కన మట్కా ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తాలూకా ఎస్ఐ రామాంజనేయులు ఆదివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,600 నగదు, మూడు మట్కా చీటీలు, మూడు పెన్నులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

అకాల వర్షాలు..

అన్నదాతకు కష్టాలు

- వర్షాలకు తడుస్తున్న కల్లాల్లోని ధాన్యం
- కాపాడుకునేందుకు రైతుల అగచాట్లు
- ఆరబెట్టేందుకు అనుకూలించని వాతావరణం
- వరి రైతుకు తీవ్ర నష్టం
- ఆదుకోని కూటమి ప్రభుత్వం


కల్లాల్లో ధాన్యం ఆరబోసుకున్న రైతన్నలు


ధాన్యంపై పట్టలు కప్పకునేందుకు అవస్థలు పడుతున్న అన్నదాతలు

నందవరం : అకాల వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. మూడు రోజులుగా ఆకాశం మబ్బులు కమ్మి మేఘావృతం కావడంతో పాటు జల్లులు పడుతున్నాయి. ఈ వానలకు మండలంలోని నది తీర ప్రాంత రైతులతో పాటు కనకవీడు, హాలహర్వి తదితర గ్రామాలలో చెరువులు, బోర్లు, బావుల కింద వరి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

70 శాతం కోతలు పూర్తి

మండలంలో ఈ ఏడాది రబీ సీజన్‌లో 1,250 ఎకరాలో వరి పంటను సాగు చేయగా.. ఈ అకాల వర్షాల కారణంగా కొంత నష్టం వాటిల్లే అవకాశం ఉందని అన్నదాతలు వాపోతున్నారు. ఇప్పటికే 1,100 ఎకరాల్లో వరి కోతలు పూర్తికాగా మిగిలిన వరి పంట వర్షాల కారణంగా తడిస్తే నష్టం వాటిల్లుతందని ఆందోళన చెందుతున్నారు. గురజాల, రాయచోటి, నదికైరవాడి, జొహరాపురం, చిన్నకొత్తిలి, పెద్దకొత్తిలి, నాగలదిన్నె గ్రామాలలో 70 శాతం పూర్తి కాగా, మిగిలిన గ్రామాలలో 20 శాతం రైతులు వరి కోత కోయిస్తున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ధాన్యాన్ని కాపాడుకునేందుకు అవస్థలు

కోత కోసిన వరి ధాన్యం కూడా కల్లాల్లోనే ఉండటంతో తడవకుండా కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. టార్పాలిన్ పట్టలను కప్పినా కొంత మేర ధాన్యం తడవగా.. ఆరబెట్టేందుకు వాతావరణం అనుకూలించక పోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, జొహరాపురం, నదికైరవాడి, నాగలదిన్నె, గురజాల తదితర గ్రామాలలో ఆరబోసిన ధాన్యం అకాల వానలకు తడవటంతో నష్టం జరిగే అవకాశం ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్రమత్తం చేయని ప్రభుత్వం

అకాల వర్షాలపై రైతులను అప్రమత్తం చేయకుండా టీడీపీ, కూటమి ప్రభుత్వం ముంచేసిందని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. తుపాను తాకిడి ఉన్నా ముందుస్తు చర్యలు చేపట్టకపోవడంతో అన్నదాతలను నట్టేటముంచినట్లయ్యింది. కోసిన పంటను కొనుగోలు చేసే దిక్కులేక, కల్లాల్లో అరబోసుకుని నానా అవస్థలు పడుతున్నారు. ఆరు గాలం శ్రమించిన రైతన్న పండించిన పంటను అమ్ముకోవాడానికి అష్టకష్టాలు పడుతున్నాడు.

నానా అవస్థలు పడుతున్నాం

ఈ ఏడాది 2 ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. ఇప్పుడు పండించిన పంట కల్లంలో ఉంది. ధాన్యం వర్షానికి తడవకుండా కాపాడుకోవాడానికి నానా కష్టాలు పడాల్సి వస్తోంది. ఓ వైపు కోత మిషన్లు దొరకక ఇబ్బంది పడ్డాం. మరో వైపు వానలు పడుతుండటంతో తడిసిన ధాన్యాన్ని వ్యాపారులు తక్కువ ధరకు అడిగే ప్రమాదం ఉంది. ఈ ఏడాది పెట్టుబడి పెరిగి..ధాన్యం ధర తగ్గడంతో దిక్కు తోచడం లేదు.

– వెంకటప్ప, రైతు, జొహరాపురం

దిక్కుతోచడం లేదు

అకాల వర్షాల కారణంగా దిక్కుతోచడం లేదు. ఈ ఏడాది రబీ సీజన్‌లో 4 ఎకరాల్లో వరి పంట సాగు చేశా. మంచి దిగుబడి వస్తుందని ఆశించా. అకాల వర్షాలకు కోత కోయాల్సిన వరి ధాన్యం నేలపాలు అవుతుందని భయంగా ఉంది. కోత కొద్దామన్నా మిషన్లు దొరకడం లేదు. మేఘాలు కమ్ముకోవడంతో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వరి కోత యంత్రాలకు డిమాండ్ పెరిగింది. వాన కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

– చిన్నారెడ్డి, రైతు, పెద్దకొత్తిలి

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎస్పీ హేమలత

ఆదోని రూరల్: డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, మద్యం, గంజాయిలాంటి మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని ఆదోని డీఎస్పీ హేమలత సూచించారు. ఆదివారం డీవైఎఫ్ఐ ఆదోని పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 29, 30వ తేదీల్లో పట్టణంలో నిర్వహించనున్న యువ చైతన్య సైకిల్ యాత్ర పోస్టర్లను విడుదల చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ యువత చెడ దారిన వెళ్లకుండా వారిలో మార్పు తెచ్చేందుకు డీవైఎఫ్ సైకిల్ యాత్ర చేపట్టాలనుకోవడం అభినందనీయమన్నారు. డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వీరేష్, నాయకులు వెంకటేష్, నవీన్, సతీష్, మోహన్, వీరు తదితరులు మాట్లాడుతూ రెండు రోజుల పాటు యువ చైతన్య సైకిల్ యాత్ర నిర్వహిస్తామన్నారు. సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని వారు కోరారు.

రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యలను ఖండించాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై ఉండి శాసనసభ్యులు కనుమూరి రఘురామకృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రజాతంత్ర్యవాదులు, మేధావులు, లౌకిక వాదులు, ప్రజలు ప్రతిఒక్కరూ ఖండించాలని సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు లింగన్న, లక్ష్మన్న, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, వెంకటేష్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పాలకోడేరు గ్రామంలో పేదల ఇళ్లను కృష్ణంరాజు కూల్చివేశారన్నారు. ప్రజల పక్షాన నిలబడి నిరాశ్రయులైన ప్రజలకు న్యాయం చేయాలని పోరాడుతున్న శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ఆయనను వెంటనే ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం


ప్రతిభ గల విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న అభ్యుదయ దళిత సేవా సంఘం

ఆదోని సెంట్రల్: స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం అభ్యుదయ దళిత సేవా సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ఉపాధ్యాయుడు ఎంసీ సుంకన్న, సామాజిక కార్యకర్త బూదూరు శ్రీనివాసులు హాజరై పదిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పదిలో ఎండీ సాయి నందిని 596 మార్కులు, కె.సంకేత్ 585, రుత్వక్ సాయి 581, యం.సూర్యతేజ 576 మార్కులు, ఇంటర్మీడియెట్‌లో యం.రాఘవేంద్ర 958 మార్కులు సాధించినట్లు చెప్పారు. వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్‌టీఓసీ ఆర్.స్వామి, ఉపాధ్యాయులు మల్లికార్జున, ఏఎస్ఓ డి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ సంఘం నాయకులు తిక్కస్వామి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఈరన్నస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు


పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం అమావాస్య ఉండడంతో భక్తులు తమ ఇంటి ఇలావేల్పును దర్శంచుకోవాడానికి వేలాదిగా తరలివచ్చారు. దర్శనానికి గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహరతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. అమావాస్య సందర్భంగా లక్ష పుష్పార్చన పూజలు చేపట్టడంతో భక్తులు ఈ పూజల్లో పాల్గొని భక్తిని చాటుకున్నారు. అలాగే మండలంలోని బుడుములదొడ్డి ఆంజినేయస్వామి, తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయానికి అమావాస్య వేడుకలతో భక్తులు అధికంగా తరలివచ్చారు.

దర్గాలో అమావాస్య వేడుకలు


దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ఆదివారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వేడుకలకు వివిధ ప్రాంతా నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి ప్రత్యేక ఫాతేహాలను నిర్వహించారు. ఆదివారం అమావాస్య కావడంతో భక్తులు అధికంగా స్వామి దర్శనానికి తరలిరావడంతో దర్గా పరిసరా ప్రాంతాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. అంతకు ముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు.

హసీనా ఆపరేషన్‌కు ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలోని శ్రీరామ్ నగర్ కాలనీలో రెండు రూపాయల బిళ్లను మింగిన హసీనా ఆపరేషన్ కోసం పూర్వ విద్యార్థులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. శ్రీరామ్ నగర్ జానీ, ఖాజాబీ దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. వీరు గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కూతురు హసీనా గోనెగండ్లలో 7వ తరగతి చదువుతోంది. హసీనా మూడు సంవత్సరాల క్రితం ఆడుకుంటూ రెండు రూపాయల బిళ్లను మింగింది. అప్పట్లో తండ్రి జానీ ప్రథమ చికత్స చేయించాడు. మలవిసర్జన సమయంలో పడిపోయిందని కుటుంబ సభ్యులు అనుకున్నారు. అయితే మూడు నెలల క్రితం హసీనాకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించినప్పటికీ తగ్గలేదు. దీంతో ఎక్స్‌రే తీయించగా పెద్ద పేగులో రెండు రూపాయల బిళ్ల ఉందని.. హైదరాబాదుకు తీసుకువెళ్లమని వైద్యులు సలహా ఇచ్చారు. హైదరాబాద్‌కు తీసుకెళ్లి అక్కడ వైద్యులకు చూపించగా వారు.. చెన్నైకు వెళ్లమని సలహా ఇచ్చారు. దీంతో అక్కడి నుంచి హసీనాను చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ఆపరేషన్ చేసి రెండు రూపాయల బిళ్లను తీసేందుకు రూ.7లక్షలు అవుతుందని తెలిపారు. విషయం తెలుసుకున్న గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.24వేలు పోగుచేసి ఆదివారం వారి హసీనా కుటుంబ సభ్యులకు అందజేశారు.

30న పాలిసెట్

ఆదోని సెంట్రల్: ఈనెల 30వ తేదీన పాలిసెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వెబ్‌సైట్‌లోకి వెళ్లి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. హాల్ టికెట్లలో ఏవైనా తప్పులు ఉంటే కళాశాల సిబ్బందిని సంప్రదించి సరి చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 81215 55646 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: లోడింగ్ అన్‌లోడింగ్ చేసే హమాలీల కోసం కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సిఐటీయు మండల కార్యదర్శి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.ఆదివారం స్థానిక సివిల్ సప్లై గోదాములో హమాలీ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు హమాలీ కార్మికులకు ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం లేదన్నారు. గత ఎన్నికల ముందు 50 సంవత్సరాలున్న హమాలీలకు పెన్షన్ ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయడం లేదన్నారు. కార్మిక సమస్యలపై మే 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో అన్ని రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మే డేను జయప్రదం చేయండి

కోసిగి: మండల కేంద్రంలో మే 1న నిర్వహించనున్న మే డే కార్యక్రమంలో కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం కోసిగి సీఐటీయూ కార్యాలయంలో మండల కార్యదర్శి రాముడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్మిక చట్టాలను కాలరాస్తున్నాయని విమర్శించారు. ఎన్నో ఏళ్లగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి యాజమాన్యానికి అనుకూలంగా లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. సీఐటీయూ మండల నాయకులు హెప్సీబా రాణి, లూసమ్మ, వీరేష్, గోపాల్, హనుమంతు, వెంకటేష్ , నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి కింద పడి వ్యక్తికి గాయాలు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఆదివారం నారాయణపురం గ్రామానికి చెందిన జి.రాజశేఖర్ అనే వ్యక్తి రైలు(నం.16382) నుంచి దిగుతూ కింద పడడంతో కుడి చేయి విరిగి తీవ్రంగా గాయపడ్డాడని రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపారు. వెంటనే స్టేషన్ మాస్టర్ వెంకటేశులు, జీఆర్‌పీ పోలీసులు అంబులెన్స్‌లో గాయపడిన రాజశేఖర్‌ను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. అక్కడ పరీక్షించిన వైద్యుడు భరత్ మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు రెఫర్ చేసినట్లు వెల్లడించారు.

క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయం


మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్, కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రమేష్‌యాదవ్‌ను సన్మానించిన దృశ్యం

ఆదోని రూరల్: క్రీడలను ప్రోత్సహిస్తూ ప్రతిఏటా వివిధ రకాల క్రికెట్ టోర్నమెంట్‌లను నిర్వహించడం అభినందించదగ్గ విషయమని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేష్‌యాదవ్ అన్నారు. ఆదివారం తాలూకా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, ఫ్రెండ్‌షిప్ కప్ ఆర్గనైజర్ కె.ముజీబ్‌అహ్మద్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలు, వ్యాపారులు, హోటల్ మేనేజ్‌మెంట్స్, ఇతర వర్గాలకు నిర్వహించిన టోర్నమెంట్‌ను ప్రారంభించారు. టోర్నమెంట్ నిర్వాహకులు కె.ముజీబ్‌అహ్మద్, పోలార్డ్ బాషా, ముస్తఫా, ముబీన్, ఇక్బాల్ తదితరులు అతిథులకు పూలమాలలు వేసి సత్కరించారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలి


మాట్లాడుతున్న విరూపాక్షిరెడ్డి

నందవరం : కూటమి ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని ముగతి గ్రామంలోని తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి సర్కార్ పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అధికారం చేపట్టి దాదాపు ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయాలేదని, అటు పేదలను, ఇటు రైతులను ప్రభుత్వం మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేశారన్నారు. పార్టీలకు అతీతంగా రాష్ట్రంలో 13 లక్షల మందికి కొత్త పింఛన్లు ఇచ్చిన ఆయనకే దక్కుతుందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయకపోగా 1.6 లక్షల పింఛన్లు రద్దు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గణపతి, దాదా, రాజశేఖర్, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్లు డాక్టర్ గోపీనాథ్, ప్రసాదరావు

ఆదోని అర్బన్: ఆదోని లయన్స్ క్లబ్ వారు సేవా కార్యక్రమాల్లో భాగంగా వేసవికాలాన్ని దృష్టిలో వుంచుకొని ప్రజలకు చల్లటి మంచినీటిని అందించే లక్ష్యంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్లు డాక్టర్ గోపీనాథ్, ప్రసాదరావు తెలిపారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్ పక్కన ఉన్న రాయల్ ట్రేడర్స్ షాపు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు.

చలివేంద్రాన్ని రాయల్ ట్రేడర్స్ అధినేత దేవేంద్రనాథ్‌గుప్తా ఆధ్వర్యరోల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్‌గుప్తా, విశిష్ట సభ్యులు నీలమోహన్, ఓంప్రకాష్, వనపరాజు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుబడిన మద్యం బాటిళ్లను చూపుతున్న ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి , ఎస్ఐ కార్తీక్ సాగర్

కోసిగి: అక్రమంగా కర్ణాటక ప్రాంతానికి చెందిన మద్యం తరలిస్తుండగా దాడులు చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్ సాగర్ సిబ్బందితో కలిసి నదీతీర గ్రామాల్లో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో అగసనూరు గ్రామానికి చెందిన గొర్లి చిన్న భీమేష్, కోసిగికి చెందిన బి.రామకృష్ణ అనే ఇద్దరు వ్యక్తులు తుంగభద్ర నది ఒడ్డున గురురాఘవేంద్ర పంప్‌హౌస్ వద్ద 12 బాక్స్‌లలో 1152 ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను గ్రామాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంచగా పట్టుకున్నట్లు తెలిపారు. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామన్నారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.46,080 ఉంటుందని చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ కానిస్టేబుల్స్ భరత్, రవికుమార్, మునిరంగడు పాల్గొన్నారు. గ్రామాల్లో అక్రమ మద్యం తరలించినా, నాటుసారా తయారు చేసినా సెల్ 94409 02580 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

కోసిగి ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ


బస్టాండ్ పరిసరాలను పరిశీలిస్తున్న కర్నూలు ఆర్ఎం టి. శ్రీనివాసులు

కోసిగి: మండల కేంద్రం కోసిగి ఆర్టీసీ బస్టాండ్‌ను ఆర్టీసీ కర్నూలు ఆర్ఎం టి. శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ చలపతి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. తాగునీటి వసతి, ఫ్యాన్లు, కుర్చేందుకు కుర్చీలు, వీధిలైట్లు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. బస్టాండ్ వెనుక భాగంలో ఖాళీ స్థలంలో స్కూటర్లు, సైకిళ్ల పార్కింగ్ ప్రాంతంగా మారుస్తామని చెప్పారు. బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసి దుకాణాల ద్వారా బస్సులు బస్టాండ్‌లోకి వచ్చి వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉందని తమ దృష్టి వచ్చిందన్నారు. అలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు. అలాగే బస్టాండ్‌లో కార్గో సర్వీసు పార్సల్ పాయింట్ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఆదోని డిపో మేనేజర్ రఫిక్, సిబ్బంది శ్రీనివాసులు ఉన్నారు.

కోసిగిలో ట్రాఫిక్ జాం


కోసిగి రైల్వే గేటు వద్ద రద్దీగా ఉన్న వాహనాలు


జుమ్మాలదిన్నె గ్రామ వద్ద ట్రాఫిక్ జాం

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో ఆదివారం ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఆదివారం అమావాస్యను పరుస్కరించుకొని కౌతాళం మండలంలోని ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రానికి కర్నూలు, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి కోసిగి మీదుగా వేలాది వాహనాల రాకపోకలతో రద్దీ కొనసాగింది. కోసిగిలో రైల్వే గేటు పడటంతో వాహనాలు ఇరువైపులా ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. రైలు వెళ్లిపోయి గేటు తెరిచే సరికి వాహనాలన్నీ వెళ్లేందుకు సుమారు 20 నిమిషాలకు పైగా సమయం పట్టింది. రోడ్డు ఇరుకుగా ఉండంతో వాహనాలు ఎదురెదురుగా రావడంతో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాయి. వాహనాలు గేటు దాటక మునుపే మరో సారి గేటు పడడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే జుమ్మాలదిన్నె గ్రామంలో ఇళ్ల మధ్యలో వాహనాలు వెళ్లుతుండడంతో వాహనాలు ఇరుక్కుపోయి తీవ్ర మైన ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ప్రతి అమావాస్య, శ్రావణమాసంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి భక్తులకు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరారు.